క్లుప్తంగా

కొండచిలువ కలకలం



కొత్తగూడ : మండలంలోని గుంజేడు ముసలమ్మ జాతరలో గురువారం కొండచిలువ ప్రత్యక్షమైంది. జాతరలో కోళ్లు విక్రయించే వ్యాపారి యాకూబ్ జాలి బోనుకు తాళం వేసి వెళ్లాడు. ఉదయం వచ్చి తాళం తీసే సరికి బోనులో సుమారు 8 ఫీట్ల కొండచిలువ ఉండడాన్ని గమనించాడు. ఈ విషయాన్ని పూజారి వెంకన్నకు తెలియజేయగా ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ అధికారులు వచ్చి కొండ చిలువను స్వాధీనం చేసుకుని సమీప అటవీ ప్రాంతంలో వదిలేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.

అమ్మాపురం ఆలయంలో..

తొర్రూరు రూరల్ : మండలంలోని అమ్మాపురంలో గల ఆలయంలో గురువారం కొండచిలువ పాము ప్రత్యక్షమైంది. దీంతో అర్చకులు, భక్తులు భయాందోళనకు గురై గ్రామస్తులతో కలిసి కొండ చిలువను చంపివేశారు.

పుస్తకాల బహూకరణ



కురవి : మండలంలోని బలపాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు పుస్తకాలను గురువారం బహూకరించారు. గ్రామానికి చెందిన నెల్లూరి శ్రీనివాసరావు రూ.5,500 విలువ కలిగిన పుస్తకాలను, 2008–09 పదో తరగతి పూర్వ విద్యార్థుల తరపున బత్తుల రామకృష్ణ, శనిగరపు వీరన్న, షేక్ నాగుల్‌మీరా రూ.3వేల విలువైన పుస్తకాలను అందించారు. దీంతో పలువురు వారిని అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.బాబు గురువారం తెలిపారు.

అట్రాసిటి కేసు నమోదు

డోర్నకల్ : కులం పేరుతో దూషించాడనే ఫిర్యాదుతో డోర్నకల్ పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షంరెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు సీఐ బి.రాజేష్ గురువారం తెలిపారు. ఈ నెల 20న గొల్లచర్లకు చెందిన దార్ల వీరన్న, పగిడిపాల వెంకటేశ్వర్లు, మేకపోతుల శ్రీనివాస్, యాదండ్ల శ్రీను తదితరులు గ్రామ ప్రధాన వీధిలో గుంతలు పూడ్చేందుకు డస్ట్‌తో పాటు కంకర పోశారు. ఈ క్రమంలో పీఏసీఎస్ చైర్మన్ భిక్షంరెడ్డి గుంతలు పూడ్చడంలో వివక్ష చూపుతున్నారని, పూర్తిస్థాయి గుంతలు పూడ్చడం లేదంటూ కులంపేరుతో దూషించాడని వారు ఆరోపించారు. కులంపేరుతో దూషించడంతో గ్రామానికి చెందిన దార్ల వీరన్న ఫిర్యాదు మేరకు భిక్షంరెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పేకాటరాయుళ్లపై..

మహబూబాబాద్ రూరల్ : ఆరుగురు పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి వారివద్ద నుంచి సెల్ఫోన్లు, రూ.7,150 నగదు స్వాధీనం చేసుకున్నామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపిక గురువారం రాత్రి తెలిపారు. మండలంలోని సండ్రాళ్లగూడెం శివారులో ఏఎస్సై రమేష్, సిబ్బంది తనిఖీ చేస్తుండగా పేకాట ఆడుతున్నారని సమాచారంతో సప్పిడి సతీష్, ఆలకుంట్ల కుమార్, షేక్ రహీంపాషా పట్టుబడగా తూర్పాటి కృష్ణ, ఎండీ ముని, పడిశాల రజనీకాంత్ పరారయ్యారని తెలిపారు.వారిపై కేసు నమోదు చేశామన్నారు.

గంజాయి సేవిస్తున్న నలుగురిపై..

గూడూరు : గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి తెలిపారు. గూడూరు శివారు పాకాలవాగు సమీప బొల్లెపల్లి వెళ్లే రహదారి పక్కన కొంతమంది యువకులు గంజాయి తాగుతున్నారనే సమాచారం మేరకు వెళ్లి వారిని సోదా చేశామని తెలిపారు. వారి నుంచి 305 గ్రాముల గంజాయి, సిగరెట్లు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని విచారించి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీలు ఢీ.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

దంతాలపల్లి : ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొట్టిన ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. హర్యానాకు చెందిన లారీ డ్రైవర్ మహ్మద్ హకీమ్ ఖమ్మం నుంచి ఢిల్లీకి మిర్చి లోడుతో వెళ్తున్నాడు. మరో ట్యాంకర్ లారీ డ్రైవర్ హైదరాబాద్ నుంచి కాకినాడకు ఖాళీ లారీతో వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే ప్రమాదవశాత్తు లారీలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో డ్రైవర్ హకీమ్‌కు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

పన్ను చెల్లింపులో జాప్యం

- కుంటుపడుతున్న గ్రంథాలయాల అభివృద్ధి
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- సౌకర్యాలు లేక పాఠకులకు ఇబ్బందులు



గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న పాఠకులు

మహబూబాబాద్ : విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాల అభివృద్ధి పన్నుల పైనే ఆధారపడి ఉంది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వసూళ్లు చేసిన గ్రంథాలయాల పన్ను వెంట వెంటనే జిల్లా కేంద్ర గ్రంథాలయ ఖాతాలో జమ చేయాల్సి ఉంది. కానీ గ్రంథాలయాల పన్ను చెల్లించకపోవడంతో వాటి అభివృద్ధి కుంటుపడుతోంది. కనీస సౌకర్యాలు లేక పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వసూళ్లు చేస్తున్నారే తప్పా చెల్లింపు విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు.

14 గ్రంథాలయాలు..

జిల్లావ్యాప్తంగా 14 గ్రంథాలయాలు ఉన్నాయి. అందులో జిల్లా గ్రంథాలయం, 11 శాఖ గ్రంథాలయాలు, 2 గ్రామ గ్రంథాలయాలు. జిల్లాలోని ఇనుగుర్తి, కేసముద్రం, నెల్లికుదురు, తొర్రూర్, దంతాలపల్లి, డోర్నకల్, గార్ల, బయ్యారం, మరిపెడ, కొత్తగూడ, గూడూరు మండలాల్లో శాఖ గ్రంథాలయాలు ఉన్నాయి. కురవి గ్రంథాలయానికి రూ.10లక్షలు మంజూరు అయినా స్థలంలేక భవన నిర్మాణంలో జాప్యం జరుగుతుంది. ఈ గ్రంథాలయాలకు కూడా లైబ్రేరియన్లు లేరు. వీటికి స్వీపర్లే దిక్కు.

జమచేయని బకాయిలు..

గ్రంథాలయాల నిర్వహణకు ఇంటి పన్నులో 8శాతం చెల్లించాల్సి ఉంటుంది. కాగా జీపీల్లో, మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్లు చేస్తున్నారు. రోజు వసూళ్లయిన పన్ను వెంటనే గ్రంథాలయాల పన్ను రూపంలో చెల్లించాలి. కాని చెల్లించడం లేదని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి టి.శ్రీలత తెలిపారు. మానుకోట,త తొర్రూర్, డోర్నకల్, మరిపెడ మున్సిపాలిటీలు ఉండగా గ్రంథాలయాల పన్ను చెల్లింపులో జాప్యం చేస్తున్నారు. ఇటీవలనే కేసముద్రం కూడా మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యింది. 482 గ్రామ పంచాయతీలు ఉండగా వాటి నుంచి కూడా పన్ను చెల్లించడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నాలుగు మున్సిపాలిటీల నుంచి సుమారు రూ.80లక్షలు, గ్రామపంచాయతీల నుంచి రూ.65నుంచి రూ.70లక్షల వరకు సెస్ బకాయిలు ఉన్నాయని శ్రీలత పేర్కొన్నారు.

కోటిన్నరపైగా బకాయిలు

కోటిన్నర పైగానే సెస్ బకాయిలు ఉన్నాయి. దీంతో గ్రంథాలయాల నిర్వహణ భారంగా మారింది. కేవలం పన్నులపై గ్రంథాలయాల అభివృద్ధి ఆధారపడి ఉంది. మున్సిపల్ కమిషనర్, డీపీఓ, అధికారులు సహకరించాలి. అదనపు కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

\- టి.శ్రీలత, జిల్లా గ్రంథాలయ ఇన్‌చార్జ్ కార్యదర్శి

నిర్వహణ అంతా సెస్‌పైనే

జిల్లాలోని 14 గ్రంథాలయాల అభివృద్ధి సెస్‌పైనే ఆధారపడి ఉంది. సౌకర్యాల కల్పన, సిబ్బంది వేతనాలు, నిర్వహణ అంతా ఆ పన్నులతో చేయాల్సి ఉంది. జిల్లా గ్రంథాలయంలో లిఫ్ట్ పని చేయకపోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు.

చైర్మన్ నియామకం ఎప్పుడో?

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా పనిచేసిన గుడిపుడి నవీన్‌రావు 2023లో రాజీనామా చేశారు. అప్పటి నుంచి చైర్మన్ నియామకం జరగలేదు. చైర్మన్ లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుంది. జిల్లా చైర్మన్ నియాయకం చేయాలని, పన్ను చెల్లించేలా చూడాలని, సిబ్బంది భర్తీ చేయాలని పాఠకులు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్



కురవి: మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

దంతాలపల్లి /కురవి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రు నాయక్ పేర్కొన్నారు. గురువారం దంతాలపల్లి, కురవి మండలకేంద్రాల్లో లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలని ముఖ్యమంత్రి పనిచేస్తున్నాడని తెలిపారు. మండలంలో సుమారు 870 రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడాలని సూచించారు. సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా గెలిపించుకునే బాధ్యత తనదన్నారు. గతంలో కేసీఆర్ కుటుంబం కమీషన్ వచ్చే మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం తప్ప చేసిన అభివృద్ధి ఏది లేదన్నారు. తమ కుటుంబ సభ్యులను దేశంలోనే కుబేరులు చేయాలనే తపన తప్ప ప్రజల గురించి ఎన్నడు ఆలోచించలేదన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



నెల్లికుదురు: రేషన్ కార్డు మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ / మహబూబాబాద్ రూరల్ / కేసముద్రం / నెల్లికుదురు : వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం మహబూబాబాద్, కేసముద్రం ప్రధాన రహదారిపై వరదను, జిల్లా కేంద్రంలో రహదారిపై ప్రవహిస్తున్న వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారన్నారు. పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.అలాగే ఇనుగుర్తి, నెల్లికుదురు మండల కేంద్రాల్లో కొత్త రేషన్ కార్డుల మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేసి, మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ హరిప్రసాద్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



వెంకటరెడ్డికి చెక్కు అందజేస్తున్న ఆత్మ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఉద్యాన అధికారి మరియన్న

కురవి : ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని మరిపెడ ఆత్మకమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఆయిల్‌పామ్ తోటలో అంతరపంటగా కోకో పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎకరం ఆయిల్‌పామ్ సాగుతో రూ.లక్ష ఆదాయం పొందిన కురవికి చెందిన రైతు మేక వెంకటరెడ్డిని ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్‌జాటోత్ రామచంద్రు నాయక్ సన్మానించారు. ఆయిల్‌పామ్ గెలల అమ్మకం ద్వారా రూ.3.10లక్షల చెక్కును వెంకటరెడ్డికి అందించారు.

హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని ధర్నా



గార్ల పాకాల ఏటి వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం, బీఆర్ఎస్ పార్టీల నాయకులు

గార్ల : పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని గురువారం సీపీఎం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏటి వద్ద ధర్నా చేపట్టారు. పాకాల ఏటి వద్దకు కలెక్టర్ వస్తున్నారని అధికారులు తెలుపడంతో సమస్యను విన్నవించడానికి వస్తే, కలెక్టర్ పాకాల ఏటిని సందర్శించకుండానే వెళ్లిపోయాడని పేర్కొన్నారు. ధర్నా అనంతరం ఎంపీడీఓ మంగమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి అలువాల సత్యవతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, మీగగ శ్రీనివాస్, నాగరాజు, మౌనిక, రమ, లక్ష్మి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలి



పెద్దవంగర: మాట్లాడుతున్న కర్ర శ్రీనివాస్‌రెడ్డి



తొర్రూరు: మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

తొర్రూరు/కేసముద్రం/చిన్నగూడూరు/పెద్దవంగర/దంతాలపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో, కేసముద్రం మున్సిపాలిటి పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో, చిన్నగూడూరు,పెద్దవంగర మండల కేంద్రాల్లో బీజేపీ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్రం అందించే నిధులతోనే అని అన్నారు. ఈవిషయాన్ని పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ తొర్రూరు మండల అధ్యక్షుడు గట్టు రాంబాబు, కేసముద్రం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేశ్, చిన్నగూడూరు మండల అధ్యక్షుడు వేణు, పెద్దవంగర మండల అధ్యక్షుడు కట్కోజు భాస్కరాచారి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి, మానుకోట జిల్లా ఎన్నికల కన్వీనర్ మహేష్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీమాన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములుగౌడ్, నాయకులు ఝాన్సీ, రచ్చకుమార్, శ్రీనివాస్, సుధాకర్, రాము, సందీప్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు: వినతిపత్రం ఇస్తున్న నాయకులు



నర్సింహులపేటలో..



కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం



టేకులగూడెం పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం : ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం మండలంలోని ఇసుకమేధి, వెంకటాపురం, మిర్యాలపెంట, కంబాలపల్లి, జగత్‌రావుపేట, కొత్తగూడెం, కస్తూరినగర్, రామచంద్రాపురం, మొట్లతిమ్మాపురం, అల్లిగూడెం, ఇర్సులాపురం, కోటగడ్డ, కొత్తపేట పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయా పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. అల్లిగూడెం పంచాయతీ భవనాన్ని, కంబాలపల్లిలో బస్సు సర్వీస్‌ను వెంకటాపురం పంచాయతీలోని టేకులగూడెం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. శిథిలావస్థకు చేరిన తరగతిగది స్థానంలో కొత్తది నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, మహబూబాబాద్ ఆర్టీసీ డీఎం శివప్రసాద్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న పాఠశాల

మహబూబాబాద్ అర్బన్ : రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మానుకోట మున్సిపల్ పరిధిలోని జామాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణ మొత్తం నీటితో నిండి చెరువును తలపిస్తోంది. ప్రధానోపాధ్యాయుడు సమ్మట వెంకటేశ్వర్లు మున్సిపల్ అధికారులకు తెలపగా డోజర్‌తో వర్షం నీటిని తొలగించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరయ్యారు.

ప్రమాదకరంగా కల్వర్టు

గంగారం : గంగారం–కోమట్లగూడెం మధ్య బ్రిడ్జి నిర్మాణం చేపట్టుతున్నారు. కోమట్లగూడెం వెళ్లేందుకు తాత్కాలిక రోడ్డు వేయగా నీటి ప్రవాహానికి కొట్టుకు పోయింది. స్పందించి సీఐ సూర్యప్రకాశ్, ఎస్సై రవి కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు, ఈసం రమ, సిబ్బంది ఆధ్వర్యంలో ఇసుక బస్తాలు వేయించారు.

‘స్థానిక’ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

మహబూబాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పించాలని స్థానిక సంస్థల ప్రాతినిధ్య సాధన కమిటీ జిల్లా కన్వీనర్ హన్మంతు డిమాండ్ చేశారు. కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మరిపెడ రూరల్ /కురవి : కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ పంచాయతీ, కంప్యూటర్ ఆపరేటర్లు కోరారు. ఈ మేరకు గురువారం డీఎస్‌పీఓ పుల్లారావు, మరిపెడ ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, కురవి ఎంపీడీఓ వీరబాబు కు వారు వినతి పత్రాలు అందజేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మరిపెడ : విద్యార్థులు మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ గేమ్‌ల జోలికి పోవద్దని సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మరిపెడలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.

కనీస వేతనం అందించాలి

పెద్దవంగర : కేజీబీవీ సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. కస్తూర్బాల్లో పని చేసే సిబ్బంది సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 31 కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నా కరపత్రాలను టీయూసీఐ నాయకులు గురువారం మండలంలోని చిన్నవంగరలో కేజీబీవీలో ఆవిష్కరించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మహబూబాబాద్ అర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న అనేక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని నందమూరి నగర్‌లో పాఠశాలను గురువారం సీపీఐ నాయకులు గురువారం సందర్శించారు.

సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ అర్బన్ : జిల్లాలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు కేతోతు సాయికుమార్, గుగులోత్ సూర్య ప్రకాశ్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఆర్సీ కార్యాలయంలో గురువారం డీఎస్‌ఎఫ్ఐ నాయకులు ఆర్సీఓ రత్నకుమారికి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మహబూబాబాద్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేస్తోందని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయా తహసీల్దార్లరు వినతిపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, పెండింగ్ డీఏలు విడుదల, పీఆర్‌సీ నివేదిక అమలు, సీపీఎస్‌ను రద్దు చేయాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. జీఓ 317ను వెంటనే రద్దు చేయాలని, అలాగే వేతన సమస్యలు, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ), టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు



పెద్దవంగరలో..

విద్యుత్ సమస్యల పరిష్కారంపై దృష్టి



మాట్లాడుతున్న డీఈ హీరాలాల్

డోర్నకల్: విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని విద్యుత్‌శాఖ డీఈ(టెక్నికల్) హీరాలాల్ తెలిపారు. మండలంలోని పెరుమాళ్ల సంకీస గ్రామంలో గురువారం జరిగిన విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో తడిసిన ఇనుప స్తంభాలు, స్టార్టర్లు, మోటార్లు, విద్యుత్ వైర్లతో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం పడుతున్న సమయంలో వీటిని నేరుగా తాకొద్దని తెలిపారు. విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ విజయ్, ఏడీఈ రమేశ్, ఏఈ కిరణ్, డోర్నకల్ ఎస్సై ఉమ పాల్గొన్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంతో పాటు ఆయా మండల కార్యాలయాల్లో గురువారం పార్టీ మండల అధ్యక్షులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులచ కార్యకర్తలు పాల్గొన్నారు.కాగా బయ్యారం మండలంలోని గంధంపల్లి గ్రామానికి చెందిన నాయిని వెంకన్న మొక్కజొన్న పంట సాగు చేసి నష్టపోయిన సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాతా గణేష్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కేటీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, బీఆర్ఎస్ నాయకులు



తొర్రూరులో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సంక్షిప్త సమాచారం

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్ : గ్రామాల్లో విధులు నిర్వహించే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని డోర్నకల్ సీఐ బి.రాజేష్ ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో గురువారం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. త్వరలో ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నందున విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు.

కమిషనర్‌కు వినతి

మహబూబాబాద్ : జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనాన్ని సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి అందుబాటులోకి తేవాలని పలు సంఘాల ఆధ్వర్యంలో గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ టి.రాజేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు.

కాటమయ్య కిట్ల పంపిణీ

దంతాలపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో గల 150మంది గీతకార్మికులకు గురువారం కాటమయ్య కిట్లను బీసీ వెల్ఫేర్ జూనియర్ అసిస్టెంట్ శివకుమార్ పంపిణీ చేశారు.

నరేష్ కోసం కొనసాగుతున్న గాలింపు

కొత్తగూడ : చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఆగబోయిన నరేష్ కోసం గాలింపు కొనసాగుతోంది. తహసీల్దార్ రాజు, ఎస్సై రవికుమార్, మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్ స్థానికులతో గాలింపులు చర్యలు చేపట్టారు. వాగు వరదను మరోవైపు మళ్లించగా నరేష్ వాడిన చేపల వల లభ్యమైంది. నరేష్ ఆచూకీ మాత్రం దొరకలేదు. వాగు వద్ద నరేష్ బంధువులు, బూరుగు గుంపు మహిళలు రోదిస్తూ కూర్చున్నారు. చేపల వేటకు వెళ్లకుండా పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

గుర్రం జాషువా జయంతి

మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి పురస్కరించుకొని జాషువా చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ బి.లక్ష్మణ్ నాయక్, అధ్యాపకులు నివాళులర్పించారు.

అధికారులు సహకరించాలి

కొత్తగూడ : అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 కంటే ముందు సాగులో ఉన్న పోడు భూముల్లో ఆదివాసీలు వ్యవసాయం చేసుకోవడానికి అధికారులు సహకరించాలని ఐటీడీఏ పీసా సమన్వయకర్త కొమురం ప్రభాకర్ అన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం

గార్ల : దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు విఫలమయ్యాయని ఐద్వా జిల్లా కార్యదర్శి గాడిపల్లి ప్రమీల ఆరోపించారు. గురువారం గార్లలో జరిగిన ఐద్వా మండల మహాసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఐద్వా జెండాను సీనియర్ నాయకురాలు కె.అనంతలక్ష్మి ఆవిష్కరించారు.జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత, నాయకులు అలువాల సత్యవతి, ఎం నాగమణి, తాళ్లపల్లి రమ, చింత మౌనిక, కె సుజాత, భాగ్యమ్మ, వి పద్మ, వాణి, కళ్యాణి, నాగమణి, ఉమావతి, ఝాన్సీ, రాంబాయి, తదితరులు పాల్గొన్నారు.

దళారుల ప్రమేయాన్ని నియంత్రించాలి

డోర్నకల్ : ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో దళారుల ప్రమేయాన్ని నియంత్రించాలని బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వద్దిరాజు రామచంద్రరావు డిమాండ్ చేశారు. డోర్నకల్‌లో గురువారం నిర్వహించిన పార్టీ మండలస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం నిధులు మంజూరు చేస్తున్నా.. రాష్ట్రం ఇందిరమ్మ పేరుతో ప్రచారం చేయడం శోచనీయమన్నారు.

అభినందనీయం

చిన్నగూడూరు: పేద విద్యార్థుల అభ్యున్నతికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈఓ ఎస్.రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001–07లో చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల పైఅంతస్తులో కోతులు రాకుండా రూ.70వేల ఖర్చుతో ఇనుప జాలి (ఫెన్సింగ్)ను అమర్చి దాతృత్వాన్ని చాటుకున్నారు.

తీరనున్న తాగునీటి కష్టాలు

మరిపెడ రూరల్ : మరిపెడ మండలంలోని చింతలగడ్డతండా పంచాయతీ పరిధి రూప్‌సింగ్ తండాలో తాగునీటికి గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ దృష్టికి తండావాసులు తీసుకెళ్లగా తన సీడీఎఫ్ నిధుల నుంచి బోరు, పైపులైన్ కేటాయించారు. గురువారం పైపులైన్ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి పరిశీలించారు. నేడు శుక్రవారం ఎమ్మెల్యే బోరు, పైపులైన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతి



కేశవరావు(ఫైల్)

మరిపెడ రూరల్ : మరిపెడ మండలంలోని బావోజిగూడెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు మాచిరాజు కేశవరావు(95) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. హోమియోపతి వైద్యం ద్వారా పలు గ్రామాల్లో కేశవరావు సుపరిచితుడుగా పేరుపొందాడు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతున్న న్యూడెమోక్రసీ నేత..



లక్ష్మయ్య(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పట్టణ కార్యదర్శి, భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా కోశాధికారి తెల్లబోయిన లక్ష్మయ్య గురువారం మృతిచెందారు. జిల్లా కేంద్రంలోని విక్రమ్నగర్ కాలనీ చెందిన లక్ష్మయ్య ఇటీవల బైక్‌పై ఓసీ ఇంటికి వెళ్తున్నాడు. రైల్వే మూడోలైను నిర్మాణ పనుల్లో భాగంగా రైల్వే గేటు వైపునకు వెళ్లే మార్గంలో ఎలాంటి హెచ్చరిక బోర్డు లేకుండా అధికారులు రైలు పట్టాను అడ్డంగా ఏర్పాటు చేశారు. దాన్ని గుర్తించని లక్ష్మయ్య బైక్‌తో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు.